సామూహిక సత్యనారాయణ వ్రతాలు



వ్రతంలో పాల్గొన్న మహిళలు

సైదాబాద్: ధర్మరక్షణ, సర్వజన ఆయురారోగ్య ప్రాప్తిని కాంక్షిస్తూ ప్రతీ పౌర్ణమినాడు ఐఎస్‌సదన్ డివిజన్ లక్ష్మీనగర్ లోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ వైఎస్ఆర్ మూర్తి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలోని భక్త సమాజంలో నిర్వహించిన సామూహిక వ్రతాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వ్రతానికి అవసరమైన పూజాద్రవ్యాలను ఆలయ కమిటీ అందజేసింది. ఆలయ కమిటీ సభ్యులు ఓరుగంటి శ్రీరామచంద్రమూర్తి, సుబ్రహ్మణ్య శాస్త్రి, ప్రసాదరావు, కామేశ్వరి, గాయత్రి పాల్గొన్నారు.

ధ్యానాంజనేయ హుండీ ఆదాయం రూ.40.71 లక్షలు

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీ ధ్యానాంజనేయ స్వామివారి ప్రధాన ఆలయంతో పాటు ఉప ఆలయాల హుండీ లెక్కింపు గురువారం నిర్వహించారు. స్వామివారికి భక్తులు కానుకలు, ముడుపుల రూపంలో గత నాలుగు నెలలుగా రూ.40 లక్షల 71 వేలు, 229 అమెరికా డాలర్లు, 5 కెనడా డాలర్లు, 50 ఆస్ట్రేలియా డాలర్లను హుండీలో సమర్పించినట్లు ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నల్లా రఘుమారెడ్డి, సభ్యులు మధుసాగర్, సురేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అంజిరెడ్డి, యాదగిరి, ఆనందకుమార్, ఆలయ అర్చకులు అంబ ప్రసాద్‌శర్మ, ప్రవీణ్‌శర్మ, సంతోష్‌శర్మ, భక్తులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు

మన్సూరాబాద్: డివిజన్ పరిధిలో ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి పనులు చేపట్టి పూర్తి చేస్తున్నామని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి స్పష్టం చేశారు. డివిజన్ పరిధిలోని పద్మావతీనగర్, బాలాజీనగర్ నుంచి రాగాల ఎన్‌క్లేవ్ వరకు రూ.55 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా అభివృద్ధే ధ్యేయంగా పనులు చేపడుతున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించని కాంట్రాక్టర్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దుర్గంపూడి సాంబిరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, మహేంద్రనాథ్, పద్మారెడ్డి, భాస్కరాచారి, మధుసూదన్‌రావు, యాదగిరి, దశరథ్, లింగారెడ్డి, సువర్ణ, మల్లీశ్వరి, గౌరీప్రియ తదితరులు పాల్గొన్నారు.

రూనీస్‌పై పోలీసుల దాడి హేయమైన చర్య: శిల్పారెడ్డి



రూనీస్‌ని పరామర్శిస్తున్న శిల్పారెడ్డి, రాధా ధీరజ్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: అగ్రికల్చర్ యూనివర్సిటీ భూముల రక్షణ కోసం నిరసన తెలుపుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి రూనీస్, ఇతర నాయకులపై పోలీసులు దాడి హేయమైన చర్య అని బీజేపీ మహిళా మోర్చా అధ్యక్షురాలు శిల్పా రెడ్డి అన్నారు. పోలీసుల దాడిలో గాయపడి కొత్తపేటలోని ఓజోన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల రూనీస్‌ని గురువారం ఆర్‌కేపురం కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డితో కలిసి శిల్పారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూనివర్సిటీ విద్యార్థుల స్థలంలో హైకోర్టు ఏర్పాటును వ్యతిరేకించడం విద్యార్థి సంఘాలు, నాయకుల బాధ్యత అని, రూనీస్‌పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

దివ్యాంగులకు లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చేయూత

చాదర్‌ఘాట్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఐదుగురు దివ్యాంగులకు లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చేయూత నందించింది. దివ్యాంగులు చిరు వ్యాపారాలు నిర్వహించుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా తయారు చేయించిన ఐరన్ డబ్బాలను అందించింది. గురువారం ఇనిస్టిట్యూట్ ఫర్ డిజేబుల్ అధ్యక్షురాలు డాక్టర్ పద్మావతి, ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యుడు పి.కృష్ణ శేష ట్రస్ట్ ప్రతినిధులతో కలిసి డబ్బాలను దివ్యాంగులకు అందజేశారు.

మాదన్నపేటలో బాల కార్మికుడికి విముక్తి

చంచల్‌గూడ: ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా చైల్డ్‌లైన్ అధికారులు దాడులు నిర్వహించి ఓ బాల కార్మికుడికి విముక్తి కల్పించారు. బుధవారం మాదన్నపేట ఠాణా పరిధిలో ఈ ఘటన జరిగింది. వివరాలు... కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ అధికారి నందా నాయక్ ఆధ్వర్యంలో మాదన్నపేట మార్కెట్‌లో దాడులు నిర్వహించారు. చాముండా ప్లాస్టిక్ అండ్ జనరల్ స్టోర్‌లో ఓ బాలుడు (13) పని చేస్తున్నట్లు గుర్తించి అతడికి పని నుంచి విముక్తి కలిగించారు. చట్ట విరుద్ధంగా బాలుడిని పనిలో పెట్టుకున్న యజమాని హర్షన్‌పై మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా.. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కింద పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.


భూగర్భ డ్రైనేజీ పనులు ప్రారంభం

ఎల్‌బీనగర్: కాలనీల్లోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని గాయత్రీ నగర్ బ్యాంక్ కాలనీలో నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులు, కాంట్రాక్టర్‌కు ఆయన సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న, కాలనీ అధ్యక్షురాలు సరస్వతి, ప్రధాన కార్యదర్శి ఉపేందర్, వైస్ ప్రెసిడెంట్ రవీందర్‌గుప్తా, సంయుక్త కార్యదర్శులు మధు, రమేష్, కార్యవర్గ సభ్యులు మనోహర్, భిక్షమయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

హస్తినాపురం: కాలనీలో నెలకొన్న సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ అన్నారు. డివిజన్‌లోని అగ్రికల్చర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో నూతన అధ్యక్షుడిగా గెలుపొందిన చంద్రమోహన్‌రెడ్డి కమిటీ సభ్యులతో కలిసి కార్పొరేటర్‌ను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నూతన కమిటీ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి జితేందర్‌రెడ్డి, నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, జానకీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

కందుల జగదీశ్వర్‌కు పీహెచ్‌డీ



మన్సూరాబాద్: గీతం యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న ఎల్‌బీనగర్‌కు చెందిన జగదీశ్వర్ కందుల ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా పొందారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కోతులారం గ్రామానికి చెందిన జగదీశ్వర్ కందుల మెకానికల్ ఇంజినీరింగ్‌లో 'కావిటీటింగ్ ఫ్లో పాస్ట్ యాక్సిసిమెట్రిక్ బాడీస్' అనే అంశంపై పరిశోధన చేశారు. ఓయూ ప్రొఫెసర్ ఉషశ్రీ,, సీబీఐటీ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డిల సహకారంతో పరిశోధన చేసి పీహెచ్‌డీ సాధించినట్లు జగదీశ్వర్ తెలిపారు.

ఎటు చూసినా చెత్త కుప్పలే!

- ఎల్బీనగర్ నియోజకవర్గంలో పడకేసిన పారిశుద్ధ్యం
- కాలనీల్లో అనధికార డస్ట్ బిన్లు
- వర్థాల కోసం చేరుతున్న పందులు, కుక్కలు



వనస్థలిపురం ఫేజ్-4లో రోడ్డు వెంబడి ఉన్న చెత్తకుప్పలు

వనస్థలిపురం: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ కొరవడింది. పలు ప్రాంతాల్లో రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో పందులు, కుక్కలు స్వైర విహారం పెరిగింది. శానిటేషన్ అధికారుల పర్యవేక్షణ లోపం, సరిపడా సిబ్బంది లేకపోవడంతోనే పారిశుద్ధ్య పనులు సరిగా జరగడం లేదని కాలనీల ప్రజలు ఆరోపిస్తున్నారు.

- వనస్థలిపురం, బీఎన్‌రెడ్డినగర్, హస్తినాపురం, హయత్‌నగర్ తదితర డివిజన్లలో రోడ్ల వెంబడి, ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతోంది. జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లే కాకుండా పలు ప్రాంతాలలో అనధికారికంగా డస్ట్ బిన్లు ఏర్పాటు చేస్తున్నారు.
- కాలనీల్లో కొందరు ఇళ్ల వద్దకు వచ్చిన చెత్త రిక్షాలు, ఆటోల్లో చెత్త వేయకుండా.. కవర్లలో తెచ్చిన చెత్తను ఖాళీ స్థలాలు, రోడ్లపై పారవేస్తుంటంతో అక్కడ చెత్త పేరుకుపోతోంది.
- ఆయా ప్రాంతాల్లో చెత్తను వేయకుండా నియంత్రించడంలోను, చెత్తను సకాలంలో తొలగించడంలోనూ శానిటేషన్ అధికారులు విఫలవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో ఆయా ప్రాంతాలు చెత్తకుప్పలుగా మారి పందులు, కుక్కలకు నిలయాలుగా మారుతున్నాయంటున్నారు.
- శివారు ప్రాంతాలలో శానిటేషన్ సిబ్బంది సరిపడా లేరని, ఉన్నవారు కూడా నిర్ణీత సమయం వరకు పనిచేయడం లేదని, వారిపై శానిటేషన్ అధికారుల ఆజమాయిషీ లోపించిందని స్థానికులు అంటున్నారు.
- పలు కాలనీల్లో పోగేసిన చెత్తను డంప్ ప్రాంతాలకు తరలించకుండా కాలనీల్లోనే కుప్పలు చేసి కాల్చి వేస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతోనే కాలనీలు అపరిశుభ్రంగా మారుతున్నాయని అంటున్నారు.



వనస్థలిపురం పోలీసుస్టేషన్ వెనుక రోడ్డుపై పేరుకుపోయిన చెత్త



హస్తినాపురంలో చెత్తను కాల్చిన దృశ్యం

పందులు, కుక్కల సంచారం

హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని శారదానగర్ ఫేజ్-3, సామనగర్ పరిసర ప్రాంతాలలో పందులు, కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పారిశుద్ధ్య పనుల నిర్వహణ సరిగా లేకపోవడంతో పలు ప్రాంతాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. అక్కడ ఉన్న వ్యర్థాల తినేందుకు పందులు, కుక్కలు గుంపులుగా తిరుగుతున్నాయి. దీంతో కాలనీలలో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది.

-కేఎల్ నర్సింహారావు, శారదానగర్

అపరిశుభ్రంగా పరిసరాలు

బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, గాంధీనగర్ సౌత్, పరిసర కాలనీలలో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా జరగడం లేదు. పలు ప్రాంతాల్లో చెత్త కుప్పలు పేరుకుపోతుండటంతో అక్కడ వ్యర్థాల కోసం కుక్కలు చేరుతున్నాయి. చెత్తను కుక్కలు చెల్లాచెదురు చేస్తుండటంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి.

- కృష్ణారెడ్డి, గాంధీనగర్

శివ స్వాములకు సన్నిధానం షెడ్డు నిర్మాణం



శివస్వాముల సన్నిధానం షెడ్డు వద్ద చిలుక ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: ఎల్‌బీనగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో శివశక్తి సేవా సమితి ఆధ్వర్యంలో మాలధారణ చేస్తున్న శివ స్వాములు అదే ఆలయంలో ఉంటున్నారు. శివస్వాములకు అనువైన సన్నిధానం లేదని తెలుసుకున్న యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్ రెడ్డి వారి కోసం సన్నిధానం ఏర్పాటు చేసేందుకు పూనుకున్నారు. స్వాములు పూజలు చేసుకొని, ఉండటానికి అనుకూలంగా షెడ్డు నిర్మించి ఫ్లోరింగ్ చేయించారు. రేపు మాలధారణ కోసం శివస్వాములు శ్రీశైలం భ్రమరాంబిక క్షేత్రానికి వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో శివశక్తి సేవా సమితి అధ్యక్షుడు, గురుస్వామి కాటం రాజుతో పాటు వారి బృందం సభ్యులందరూ చిలుక ఉపేందర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాజేష్ కుమార్, వెంకటేష్, జగదీశ్, బాలకృష్ణ, కుమార స్వామి, మల్లేష్, సంజయ్, సైదులు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు ద్విచక్రవాహనాల ఢీ:

- నలుగురికి తీవ్రగాయాలు
- మైనర్ల నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తో ప్రమాదం

మలక్‌పేట: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని నలుగురు గాయపడిన ఘటన బుధవారం అర్ధ రాత్రి మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సబ్ ఇన్‌స్పెక్టర్ పోతుల నవీన్ తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్‌కు చెందిన సీహెచ్ అభినయ్(32) ప్రైవేట్ ఉద్యోగి. నాగోల్‌లో ఉండే బావ ఇంటికి వెళ్ళాడు. స్నేహితుడు టి. సంతోష్‌రెడ్డి (32)తో కలిసి ద్విచక్ర వాహనంపై నాగోల్ నుంచి దిల్‌సుఖ్‌నగర్ మీదుగా మలక్‌పేట నల్లగొండ క్రాస్‌రోడ్ వైపు బయలుదేరారు. సంతోష్‌రెడ్డి వాహనాన్ని నడుపుతున్నాడు. రాత్రి 12.30 గంటల సమయంలో మూసారంబాగ్ శ్రీపురంకాలనీ చెందిన ఇద్దరు మైనర్లు (15)ఎఫ్‌జడ్ బైక్‌పై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేస్తూ వచ్చి మెట్రో పిల్లర్ 1496 వద్ద సంతోష్ రెడ్డి, అభినయ్ వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. ఇద్దరూ కింద పడిపోవడంతో తల, కాళ్లు, చేతులకు బలమైన గాయాలయ్యాయి. మైనర్లకు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను 108లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అభినయ్ బావ కోటేశ్వర్‌రావు.. మెరుగైన చికిత్స కోసం అభినయ్, సంతోష్‌రెడ్డిలను నాంపల్లిలోని కేర్ ఆసుపత్రిలో చేర్పించారు. ఇద్దరూ అపస్మారక స్థితిలో ఉన్నారన్నారని ఎస్ఐ తెలిపారు. మైనర్లు ఇద్దరూ మలక్‌పేట యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల తలకు బలమైన గాయాలయ్యాయని చెప్పారు.

డివిజన్లలో అభివృద్ధికి సహకరిస్తా



ప్రెస్ కాలనీలో కమ్యూనిటీహాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ఒవైసీ, కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ

సైదాబాద్: హైదరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో అభివృద్ధికి సహకరిస్తానని ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ అన్నారు. గురువారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని గవర్నమెంట్ ప్రెస్ కాలనీలో రూ. 54 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీహాల్ భవనాన్ని ఆయన యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రహ్మత్, కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రణాళికలను తయారు చేసి తనకు పంపించాలని కార్పొరేటర్‌కు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు గిరిధర్‌రెడ్డి కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎస్ఐలో సామ్రాట్ అశోక్ ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభం



ప్రారంభిస్తున్న జీఎస్ఐ సదరన్ రీజియన్ హెడ్ వెంకటేశ్వర్‌రావు

మన్సూరాబాద్: జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ)లోని రాక్‌గార్డెన్స్ లోటస్ ప్లాంట్‌లో జీఎస్ఐ సదరన్ రీజియన్ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ సహకారంతో సామ్రాట్ అశోక్ ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. జీఎస్ఐ సదరన్ రీజియన్ హెడ్ సీహెచ్ వెంకటేశ్వర్‌రావు ముఖ్యఅతిథిగా హాజరై గురువారం ఈ ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సామ్రాట్ అశోక చక్రవర్తి భారతదేశాన్ని చాలాకాలం పాలించారని తెలిపారు. అనంతరం సామ్రాట్ అశోక్ జీవితం, శిలలు, స్తంభాలు, గుహల ఆధారంగా నిర్మించిన హిందీ చిత్రప్రదర్శనను తిలకించారు. కార్యక్రమంలో అధికారులు ఎల్‌పీ సింగ్, ఎంఎల్ దోర, ఎచ్‌ఎం మిషరా, జీఎస్ఐ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నేతలు ఆదర్ల మహేష్, మధిర సత్యనారాయణ, చక్రేశ్వర్, సాయిబాబ, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం: ఉప్పల



యోగా శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్‌లు

చైతన్యపురి: యోగా సాధనకు నిత్యం కొంత సమయం కేటాయిస్తే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శ్రీసత్యసాయి ధ్యాన మండలి ఆధ్వర్యంలో భిక్షమయ్య గురూజీ దిల్‌సుఖ్‌నగర్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ ఆవరణలో గురువారం అంతర్ముఖ యోగా శిక్షణ తరగతులను ప్రముఖ ఫైట్ మాస్టర్లు రామ్‌లక్ష్మణ్‌లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప్పల మాట్లాడుతూ, చిన్న తనం నుంచే యోగా సాధన చేయడం వల్ల మానసిక, శారీరక సమస్యలు దరి చేరవన్నారు. రామ్‌లక్ష్మణ్‌లు మాట్లాడుతూ, 30 ఏళ్లుగా ఆధ్యాత్మిక రంగంలో భిక్షమయ్య గురూజీ వెంట నడుస్తూ ఎంతో జ్ఞానాన్ని పొంది సర్వసాధారణమైన జీవితాన్ని గడుపుతున్నామన్నారు. కార్యక్రమంలో లోటస్ ల్యాప్ చైర్మన్ లయన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఇస్మాయిల్‌గురు. భావన శ్రీనివాస్, వేణుమాదవ్, రాంచందర్‌రావు, సంపత్‌గురు, మధుబాల మాతాజీ తదతరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు



లబ్ధిదారుడి తండ్రికి ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

నాగోలు: సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ సాయినగర్ కాలనీకి చెందిన లక్ష్మీ నాగరాజు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తలకు తీవ్రగాయం కావడంతో ఆయనను చికిత్స నిమిత్తం పంజగుట్ట నిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేక పోవడంతో కుటుంబ సభ్యులు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని సంప్రదించగా, ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు. లక్ష్మీనాగరాజు ఆపరేషన్ ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి నుంచి రూ.1.50 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీని గురువారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి లబ్ధిదారుడి తండ్రికి అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎం సహాయనిధి దోహద పడుతోందని అన్నారు. కార్యక్రమంలో బీఎన్ రెడ్డి నగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, పోగుల రాంబాబు పాల్గొన్నారు.

యువతను క్రీడల్లో ప్రోత్సహించాలి



పుల్లెల గోపిచంద్‌ను సన్మానిస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

మలక్‌పేట: దిల్‌సుఖ్‌నగర్ షటిల్ ప్లేయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన 19వ ఇన్విటేషనల్ రిపబ్లిక్‌డే బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ఐదు రోజులు జరిగింది. ముగింపు సందర్భంగా గురువారం మూసారంబాగ్ ఎస్‌బీహెచ్ ప్లేగ్రౌండ్స్‌లో ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవానికి బ్యాడ్మింటన్ నేషనల్ చీఫ్ కోచ్ డాక్టర్ పుల్లెల గోపిచంద్, ఎండీబీఏ సెక్రటరీ పీసీఎస్ రావు, మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి, బీఏటీ ట్రెజరర్ వంశీధర్, జాయింట్ సెక్రటరీ యూవీఎన్ బాబు, ఆర్ఆర్‌డీబీఏ వైస్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ హాజరయ్యారు. టోర్నమెంట్‌లో గెలుపొందిన క్రీడాకారులకు నగదు బహుమతులు, ట్రోఫీలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో మన క్రీడాకారులు రాణిస్తున్నారని, క్రీడా స్ఫూర్తిని నింపి, యువతకు ప్రోత్సాహం అందించాలన్నారు. బి.చాణిక్య, ఎ.రెడ్డి మొదటి బహుమతి, హర్షవర్ధన్, వెంకట్‌రెడ్డి రెండో బహుమతి, శ్రీరామ్, మోహన్ మూడో బహుమతి దక్కించుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడు కె. శ్రీనివాస్‌రెడ్డి, కన్వీనర్ కరెడ్ల శ్రీనివాసరావు, వెంకటేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దవిడి శ్రీనివాస్‌రెడ్డి, విజయ్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్రం: సీఐటీయూ



సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

లింగోజిగూడ: కేంద్ర ప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు కీసర నర్సిరెడ్డి, జీహెచ్‌ఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ ఉపాధ్యక్షుడు ఆలేటి ఎల్లయ్య ఆరోపించారు. కార్మికుల వేతనాల పెంపు, ఉద్యోగాల క్రమబద్ధీకరణ కోసం ఫిబ్రవరి 16న సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె నోటీసులను గురువారం ఎల్‌బీనగర్ మూడు సర్కిళ్ల కమిషనర్లకు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సమ్మె సందర్భంగా ఈ నెల 28 నుంచి జీహెచ్‌ఎంసీ కార్మికుల చైతన్యపురి సీఐటీయూ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ కార్మికులంతా హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ, కార్మిక నాయకులు శ్రీనివాస్, వీరయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ సీపీఐ



సీపీఐ సభ్యత్వం అందజేస్తున్న పార్టీ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, రామ్ నారాయణ

నాగోలు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక పార్టీ సీపీఐ అని ఆ పార్టీ మేడ్చల్ జిల్లా సమితి సభ్యుడు బొడ్డుపల్లి కృష్ణ అన్నారు. నాగోల్, కొత్తపేట డివిజన్లలో 2024 సీపీఐ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని న్యూనాగోలు కాలనీలోని సీపీఐ అనుబంధ ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీఐ ఉప్పల మండల కార్యదర్శి పి. రామ్ నారాయణ సభ్యత్వ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రజా సంఘాల ద్వారా విస్తృతంగా సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎండీ బషీర్, రాములు, ఉడుతల మల్లేష్ గౌడ్, భూపతి. సురేష్, ఆంజనేయులు, శివ, మధు పాల్గొన్నారు.

కౌన్సిల్ సమావేశం నిర్వహించండి

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌కు బీజేపీ కార్పొరేటర్ల వినతి



జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన బీజేపీ కార్పొరేటర్లు

మన్సూరాబాద్/చంపాపేట: గత ఆరు నెలలుగా జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం జరగలేదని, త్వరలోనే పార్లమెంట్ ఎన్నికల కోడ్ రానుందని.. అంతలోపు జనరల్ బాడీ సమావేశం నిర్వహించాలని బీజేపీ కార్పొరేటర్లు కోరారు. ఈ మేరకు వారు బీజేపీ జీహెచ్‌ఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్‌రాస్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కొప్పుల నర్సింహారెడ్డి మాట్లాడుతూ, వచ్చే వేసవిలో చేపట్టాల్సిన నాలాల డీసిల్టింగ్ పనులు, శానిటేషన్ వ్యవస్థ, అక్రమ పార్కింగ్ ఫీజు, విచ్చలవిడిగా ఆస్తి పన్ను వసూలుతో పాటు పలు ప్రజాసమస్యలపై సర్వసభ్య సమావేశంలో చర్చించాల్సి ఉందన్నారు. అంతేకాకుండా జోనల్ స్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలని కూడా కమిషనర్‌ను కోరామన్నారు. తమ విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ జోనల్ స్థాయిలో సమావేశాలను వెంటనే ఏర్పాటు చేస్తామని, సాధ్యమైనంత త్వరలో కౌన్సిల్ సమావేశాలను కూడా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని నర్సింహారెడ్డి తెలిపారు. కమిషనర్‌ను కలిసిన వారిలో కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, శ్రవణ్, సురేఖ, రవిచారి, చేతన, రాజ్యలక్ష్మి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

నాసిరకంగా ఎస్ఎన్‌డీపీ పనులు : మధుసూదన్‌రెడ్డి

చంపాపేట డివిజన్ పరిధిలో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ పనులు నత్తనడకన సాగడంతో పాటు నాసిరకంగా ఉన్నాయని కమిషనర్‌కు వివరించామని చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎస్ఎన్‌డీపీ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా తవ్వకాలు చేపట్టడం వల్ల సీవరేజీ పైప్‌లైన్లు, తాగునీటి పైప్‌లైన్లు ధ్వంసం అవుతున్నాయన్నారు.ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. సదరు అధికారులు, కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని కమిషనర్‌ను కోరామన్నారు.